
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



వనపర్తి

జిల్లా వార్తలు

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 30.0 । కనిష్ఠం : 23.0

మంగళవారం 14 అక్టోబరు 2025



పాలమూరు యూనివర్సిటీ బాలికల హాస్టల్ భవనం

విద్యా కుసుమం..
జ్ఞాన పరిమళం

- అభివృద్ధి పథంలో పాలమూరు యూనివర్సిటీ
- అంచెలంచెలుగా ఎదుగుతున్న విశ్వ విద్యాలయం
- అందుబాటులోకి కొత్త కోర్సులు, భవనాలు

7



పులుల సంరక్షణకు
పరస్పర సహకారం

- నల్లమల అభయారణ్యంలో సంయుక్త గస్తీ
- ఏపీ, తెలంగాణ అటవీ శాఖ అధికారుల నిర్ణయం

7



బ్రహ్మగిరి వనమయూరి అతిథి గృహంలో సమావేశమైన రెండు రాష్ట్రాల అటవీశాఖ ముఖ్య అధికారులు

ప్రతీ ఒక్కరికి సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్



సీపీఆర్‌పై ప్రతిజ్ఞ చేస్తున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్, అధికారులు

నాగర్‌కర్నూల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆకస్మిక మరణాలను నియంత్రించే సీపీఆర్‌పై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్)పై అవగాహన కల్పించేందుకు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్ జిల్లా అధికారులకు సీపీఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రవికుమార్ జిల్లా అధికారులతో సీపీఆర్‌పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం వేలాది మంది గుండె పోటుతో మరణిస్తున్నారని, ఈ మరణాలను నియంత్రించాలంటే ప్రతీ ఒక్కరు సీపీఆర్ ప్రక్రియ నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న
జల విద్యుత్ ఉత్పత్తి

6

అంచనా 2 లక్షల
మెట్రిక్ టన్నులు

- గద్వాల జిల్లాలో ఏర్పాటు చేయనున్న 88 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- శిక్షణ పూర్తి చేసుకున్న నిర్వాహకులు



గద్వాల మండలం ముల్కలపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం చేస్తున్న కూలీలు(ఫైల్)

గద్వాల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) వానాకాలంలో సాగు చేసిన ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో 97వేల ఎకరాలలో వరి సాగు చేయగా 2.62లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. గతేడాది నుంచి ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తుండటంతో సాగు విస్తీర్ణం పెరిగింది. బోనస్ ఇస్తుండటంతో ధాన్యాన్ని రైతులు దాదాపు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో రైతులకు ఇబ్బంది కలుగకుండా జిల్లాలో 88 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో ఐకేపీ ద్వారా 70 పీఏసీయస్ 13, డీసీఎంఎస్ 5 కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు.

సందిగ్ధంలో సన్నాల రైతులు..

గతేడాది వానాకాలం సన్నాలకు ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తోంది. మొదట్లో బోనస్ చెల్లింపులపై అనుమానాలు పెట్టుకోవడంతో చాలా మంది ప్రైవేటులో విక్రయించారు. దీంతో ప్రభుత్వం 96,600 మెట్రిక్ టన్నుల ధాన్యమే సేకరించింది. కొనుగోలు కేంద్రాలలో విక్రయించిన ప్రతీ రైతుకు ప్రభుత్వం బోనస్ చెల్లించడంతో యాసంగిలో కూడా చాలా మంది రైతులు సన్నాలు సాగు చేసి కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించారు. లక్ష్యానికి మించి 1.01లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. కానీ యాసంగిలో కొనుగోలు చేసిన ధాన్యానికి నేటికీ రూ.500 బోనస్ రైతుల ఖాతాలలో జమ చేయలేదు. దీంతో ఈ వానాకాలం ధాన్యాన్ని విక్రయిస్తే ప్రభుత్వం బోనస్ ఇస్తుందా...? లేదా..? అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు. ప్రైవేట్‌లో విక్రయించాలన్నా ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో ప్రైవేటు వ్యాపారులు కూడా సన్నాలకు అనుకున్న స్థాయిలో ధర పెట్టే పరిస్థి తి కనిపించడం లేదు. ఇతర రాష్ట్రాలలో డిమాండ్‌ను బట్టి ప్రైవేటు వ్యాపారులు మార్కెట్‌లో ధరలు పెంచే అవకాశం ఉంటుంది.

విడతల వారీగా గన్నీబ్యాగులు

జిల్లాలో 97వేల ఎకరాలలో వరి సాగు చేశారు. దాదాపు 2,62,396 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. సన్నాలు 2,59,276 మెట్రిక్ టన్నుల దిగుబడి రాగా, దొడ్డు రకం 3,120 మెట్రిక్ టన్నులు ఉంటుందని అధికారుల అంచనా. ఇందులో దాదాపు 2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని సివిల్ సప్లయ్ అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. మొత్తం ధాన్యం సేకరణకు 65లక్షల గన్నీ బ్యాగులు అవసరం ఉండగా సివిల్ సప్లయ్ అధికారుల వద్ద 8లక్షల గన్నీ బ్యాగులు మాత్రమే ఉన్నాయి. మిగితా 57లక్షల గన్నీ బ్యాగులు విడతల వారీగా వస్తాయని అధికారులు అంటున్నారు.

నవంబరులో కొనుగోళ్లు..



వానాకాలంలో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నాం. మొత్తం 88 కొనుగోలు కేంద్రాల ద్వారా 2లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నాం. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ పూర్తి చేశాం. గన్నీ బ్యాగులు, రవాణా ఏర్పాట్లు, గోదాములలో నిల్వ, రైస్ మిల్లర్లతో సంప్రదింపులు పూర్తి చేశాం. నవంబరు మొదటి వారం నుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తాం.

- విమల, డీఎం సివిల్ సప్లయ్ గద్వాల

బాల్యవివాహానికి హాజరైనా కేసు నమోదు

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి



చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల్యవివాహలను అరికట్టాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు జరుగకుండా తల్లిందండ్రులతో పాటు వివాహంలో పాల్గొన్న ప్రతీ ఒక్కరిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. సెప్టెంబరు 17 నుంచి ప్రారంభమైన పోషణ మాసం కార్యక్రమం సందర్భంగా ఇచ్చిన లక్ష్యాలు, చేపట్టిన కార్యక్రమాలపై జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి వివరాలు వెల్లడించారు. బాల్య వివాహలకు సంబంధించిన ముందస్తు సమాచారం ఇచ్చేందుకు 1098, 100, 112 నంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని కలెక్టర్ అన్నారు. అనంతరం ఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ చిన్నమ్మ థామస్ రూపొందించిన ఇచ్చట బాల్య వివాహలు నిర్వహించబడవు.. అనే గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం చిన్నారులకు అన్న ప్రాశన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, పీడీఆర్‌డీఓ ఉమాదేవి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల అభీష్టం మేరకే డీసీసీల ఎన్నిక

- పాండిచ్చేరి మాజీ సీఎం వీ నారాయణస్వామి
- బీసీలకు పెద్దపీట వేసే పార్టీ కాంగ్రెస్
- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న నారాయణస్వామి, చిత్రంలో మంత్రి జూపల్లి , ఎమ్మెల్యే వంశీకృష్ణ

కొల్లాపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అభీష్టం మేరకే డీసీసీ అధ్యక్షుల నియామకం ఉంటుందని పాండిచ్చేరి మాజీ సీఎం నారాయణస్వామి స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో డీసీసీ అధ్యక్షుడు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అధ్యక్షతన జరిగిన 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ.. జోడీయాత్రలో భాగంగా ఇక్కడి కార్యకర్తల పోరాట పటిమ చూసి రాహుల్‌గాంధీ ఆశ్చర్యపోయారని గుర్తు చేశారు. అవినీతి కుటుంబ పాలన చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గద్దెదించారని అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులకు పదవులు దక్కుతాయని, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అభిప్రాయ సేకరణ కోసమే తాను కొల్లాపూర్ నియోజకవర్గానికి వచ్చినట్లు వెల్లడించారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... బీసీలకు పెద్దపీట వేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. చట్టప్రకారమే బీసీ రిజర్వేషన్లతో కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాల సమాఖ్యతో కేంద్రం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ చేసిన అప్పులకు వడ్డీ కట్టే బదులు రాష్ట్రంలో ఉన్న ఒక్కొక్క గ్రామ పంచాయతీకి రూ.30 కోట్లు కేటాయించవచ్చని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి సంధ్యారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, నాయకులు, కార్యకర్తల అభిప్రాయాన్ని సేకరించారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడి పదవికోసం డాక్టర్ పగిడాల శ్రీనివాస్ రెడ్డి, షేక్‌రహీంపాషా దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అబ్దుల్లా శ్రీనివాస్, పీసీసీ కార్యదర్శి కే వెంకటేష్, వనపర్తి డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, వనపర్తి జిల్లా గ్రంథాలయ సంస్థల ఛైర్మన్ గోవర్ధన్, పీసీసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు హనుమంత్ నాయక్, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- హాస్టల్ వర్కర్ల డిమాండ్
- 72 గంటల నిరవధిక దీక్ష



దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న శంకర్‌నాయక్

మన్ననూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 32 రోజులుగా సమ్మె చేస్తున్న దినసరి వేతనంపై పనిచేసే హాస్టల్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని హాస్టల్ వర్కర్లు సోమవారం మన్ననూరు ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో 72 గంటల నివధిక దీక్ష చేపట్టారు. వారి దీక్షకు సీఐటీయూ, కేవీపీఎస్, పౌర హక్కుల సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో గల సంక్షేమ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న దినసరి వేతన వర్కర్లకు కలెక్టర్ గెజిట్ ప్రకారం చెల్లింపు చేస్తున్న క్రమంలో వేతనాలు తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకువస్తున్న జీఓ 64 దుర్మార్గమైనదన్నారు. 35 ఏళ్లుగా హాస్టల్ వర్కర్ల చేత శ్రమదోపిడి చేయిస్తూ వారికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. 72 గంటల నిరవధిక దీక్షతోనైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి జక్క బాల య్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ సయ్యద్, హాస్టల్ వర్కర్ల సంఘం నాయకులు సురేందర్, భరత్, పర్వతాలు, ఓం ప్రకాశ్, ఏడుకొండలు, ఎల్లమ్మ తదితరులు ఉన్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 110.00
హోల్ సేల్	: 116.00
డ్రెస్డ్	: 191.00
స్కిన్ లెస్	: 218.00

రెండు నెలల్లో వంతెన పనులు పూర్తి

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి
- రూ.6 కోట్లతో అప్రోచ్ రోడ్డుకు శంకుస్థాపన



సమావేశంలో మాట్లాడుతున్న దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి

మదనాపురం అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని ఊకచెట్టు వాగుపై ఉన్న హైలెవెల్ వంతెన పనులను రెండు నెలల్లో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం వంతెనకు సంబంధించి మిగిలి పోయిన పనులకు, అప్రోచ్ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 సంవత్సరాల కిందట వంతెన పనులు ప్రారంభించినా నేటికీ పూర్తి కాలేదని అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే వంతెన పిల్లర్ల నిర్మాణం పూర్తి చేయించానని తెలిపారు. అప్రోచ్ రోడ్ నిధుల మంజూరు కోసం ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో రూ. 6 కోట్లు మంజూరు చేయించానని తెలిపారు. అంతకు ముందు ఇందిరమ్మ నమూనా ఇంటిని ప్రారంభించారు. కార్యక్రమంలో శరత్‌రెడ్డి, ప్రశాంత్, మహేష్‌కుమార్, వెంకట్ నారాయణ, రామకృష్ణ, కృష్ణవర్ధన్‌రెడ్డి, జగదీష్, మణివర్ధన్ రెడ్డి, తహసీల్దార్ జేకె మోహన్, ఎంపీడీఓ ప్రసన్న కుమారి పాల్గొన్నారు.

ఆర్‌ఐటీఐ, ఏటీసీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మన్ననూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు ఆర్‌ఐటీఐ, ఏటీసీ కళాశాలల్లో 5వ విడత ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లక్ష్మణస్వామి సోమవారం తెలిపారు. తాజా కులం, ఆదాయం, నివాసం, టీసీ, ఒరిజినల్ ధ్రువపత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో అప్‌లోడ్ చేయాలని, అభ్యర్థులు ఫోన్ నెంబర్, మెయిల్ ఐడీని ఉపయోగించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 15 నుంచి 17 వరకు మన్ననూరు ఆర్‌ఐటీఐ కళాశాలలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నేరుగా ప్రవేశాలను కల్పించనున్నట్లు తెలిపారు.

రైతుల ఆదాయం పెంచడమే
ప్రధాని లక్ష్యం

- విలేకరుల సమావేశంలో ఎంపీ డీకే అరుణ
- మూడు జిల్లాలను పీఎం-డీడీకేవై పథకానికి ఎంపిక చేసినందుకు ప్రధానికి కృతజ్ఞతలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాలమూరు ఎంపీ డీకే అరుణ

గద్వాల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకే ధన్‌ధాన్య కృషి యోజన(పీఎం-డీడీకేవై) పథకానికి ప్రధాని నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారని పాలమూరు ఎంపీ డీకేఅరుణ అన్నారు. సోమవారం గద్వాల పట్టణంలోని డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో వ్యవసాయంలో వెనకబడిన 100 జిల్లాలను ఈ పథకానికి ఎంపిక చేశారని తెలిపారు. ఇందులో మన రాష్ట్రంలోని 4 జిల్లాలకు అవకాశం ఉండగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలను ఎంపిక చేశారని తెలిపారు. మూడు జిల్లాల్లో ఈ పథకం ఆరేళ్ల పాటు అమలులో ఉంటుందని వివరించారు. రైతుల ఆదాయం పెంచడం కోసం రాష్ట్రంలోని 4జిల్లాలకు ఏడాదికి రూ.960కోట్లు వెచ్చించనున్నట్లు ఆమె వివరించారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర రానిపక్షంలో గిడ్డంగులలో నిల్వ చేసుకోవడానికి గిడ్డంగులు, శీతల గిడ్డంగుల నిర్మాణం చేస్తారని తెలిపారు. డిమాండ్ ఉన్న పంటలు సాగుచేసేందుకు రైతులకు అవగాహన కల్పించనున్నట్లు ఆమె తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు చిల్లి గవ్వకూడా ఇవ్వడం లేదని విమర్శించారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోందని విమర్శించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, ఇన్‌చార్జి డీకే స్నిగ్ధారెడ్డి, మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కౌన్సిల్ సభ్యులు బండల వెంకట్రాములు, అక్కల రమాదేవి, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, సమత తదితరులు ఉన్నారు.



విజేతలతో ఉపాధ్యాయులు

ప్రారంభమైన ఎస్‌జీఎఫ్ పోటీలు

ధరూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ధరూరు మండలంలోని ర్యాలంపాడు గురుకుల పాఠశాలలో సోమవారం 69వ ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి అండర్-14 కబడ్డీ పోటీలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాసులు ముఖ్యఅతిథులుగా హాజరై ఈ పోటీలను ప్రారంభించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన 800 మంది విద్యార్థులు కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. గద్వాల పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. బాలికల విభాగంలో ధరూర్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు విజేతలుగా నిలిచారు. విజేతలకు డీఈవో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రబాబు, ప్రతాప్‌రెడ్డి, జితేందర్, శ్రీనివాసరావు, పీఈటీలు రవి, రమ్య, బీసన్న ఉన్నారు.

జిల్లాకు 10 మంది టూరిస్టు పోలీసులు

- నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

6

గో'మాతృ'హృదయం

- తల్లిలేని బుజ్జి మేకలకు తల్లిగా మారిన ఆవు
- ప్రతీ రోజు పాలిచ్చి ఆకలి తీరుస్తున్న గోవు

6

మహిళల కోసం రాత్రి బడులు

» అక్షరాస్యత పెంపునకు అధికారుల చర్యలు
» సెర్ప్, మెప్మా సొసైటీల ద్వారా నిరక్షరాస్యుల గుర్తింపు



కోస్గి ఉమ్మడి మండలంలో మహిళా సంఘాల సభ్యులకు వయోజన విద్యపై అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్లు

కోస్గి రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహిళా అక్షరాస్యతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లోని మహిళా సంఘాల సభ్యుల్లో నిరక్షరాస్యులైన వారందరికీ చదవడం, రాయడం నేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అండర్‌స్టాండింగ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ (ఉల్లాస్) కార్యక్రమంలో భాగంగా వారిని గుర్తించి పేర్లు నమోదు చేస్తున్నారు. వారందరికీ వారి నివాస ప్రాంతాల్లోనే రాత్రి బడులు ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టారు.

కొనసాగుతున్న పేర్ల నమోదు

విద్యపై అందరికీ అవగాహన, నిరంతర అధ్యయనమే లక్ష్యంగా 'ఉల్లాస్' కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి పేర్లను నమోదు చేస్తున్నారు. నారాయణపేట జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు నారాయణపేట, మక్తల్, కోస్గి, మద్దూరులలో మెప్మా (మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మునిసిపాలిటీ ఏరియాస్) ద్వారా 35,930 మంది, గ్రామాల్లో సెర్ప్ (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ రూరల్ పావర్టీ) ద్వారా 79,112 మంది మహిళలకు ఉల్లాస్ కార్యక్రమం ద్వారా చదవడం, రాయడం నేర్పించనున్నారు. మొదటి విడతలో గ్రామాలు, పట్టణాల్లోని 35,930 మంది మహిళలను అక్షరాస్యులను చేయడమే లక్ష్యంగా నిర్దేశించారు. అందుకోసం ఇప్పటివరకు 35,390 మంది మహిళల పేర్లను నమోదు చేసుకున్నారు.

ఉన్నత విద్యాభ్యాసానికి 'టాస్'

స్వశక్తి సంఘాల్లోని మహిళల్లో చదువు మధ్యలో ఆపేసిన వారు ఉన్నత విద్యాభ్యాసం చేసేందుకు 'టాస్' (తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ) ద్వారా అధికారులు కృషి చేస్తున్నారు. దూరవిద్యలో పదవ తరగతి, ఇంటర్‌లలో ప్రవేశాలు తీసుకునేలా ప్రోత్సహిస్తున్నారు. అందుకోసం జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది మొత్తం 2241 మంది లక్ష్యంగా నిర్ణయించగా, 1,755 మంది ముందుకొచ్చారు. ఇందులో పదవ తరగతిలో 650, ఇంటర్‌లో 1,105 మంది మహిళలు ప్రవేశాలు తీసుకున్నారు. అందుకు మహిళా సంఘాల ఆర్పీలు, సీసీలు, సంఘాల సభ్యులు సహకరిస్తున్నారు.

మహిళా అక్షరాస్యతను పెంచడమే లక్ష్యం

కేంద్ర రాష్ట్ర పథకాలైన ఉల్లాస్, టాస్‌ల ద్వారా మహిళా అక్షరాస్యతను పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. పట్టణాలు, గ్రామాల్లో నిరక్షరాస్యులైన మహిళల పేర్లను నమోదు చేశాం. అలాగే వారికి ఉన్నత విద్యాభ్యాసం కోసం ఫీజులు కట్టి, ప్రవేశాలు చేయించామని వివరించారు.

- గోవిందు, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ మేనేజర్ (డీపీఎం), నారాయణపేట జిల్లా

కొనసాగుతున్న జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లోని 12 యూనిట్ల ద్వారా నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తున్నట్లు ఎస్ఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ కేంద్రంలో సోమవారానికి గడచిన 24 గంటల్లో 4.879 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఇప్పటి వరకు మొత్తం 417.816 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యింది. దిగువ కేంద్రంలో 24 గంటల్లో 4.598 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశారు. ఇప్పటివరకు 403.361 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యింది.



లోయర్ జూరాలలో జల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న టర్బైన్లు

గో'మాతృ'హృదయం

» తల్లిలేని బుజ్జి మేకలకు తల్లిగా మారిన ఆవు
» ప్రతీ రోజు పాలిచ్చి ఆకలి తీరుస్తున్న గోవు



పేట మండలం మేకహనుమాన్ తండాలో మేకపిల్లలకు పాలు ఇస్తున్న గోవు

నారాయణపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బుజ్జి మేక పిల్లలు నాలుగు.. వాటి తల్లి నెలక్రితం చనిపోయింది. ఆకలితో అల్లాడుతున్న ఆ పిల్లలకు గోమాత అమ్మగా మారింది. ప్రతీ రోజు పాలిచ్చి వాటి ఆకలి తీరుస్తోంది. జాతులు వేరైనా, ఏ జీవికైనా ఆకలి ఒక్కటేనని, అది తీర్చడమే అమ్మతనానికి అసలైన అర్థమని అందరికీ అర్థమయ్యేలా చాటి చెప్తోంది. అమ్మ ఎవరికైనా అమ్మే అన్న నానుడికి అద్దం పట్టింది. నారాయణపేట మండలంలోని మేకహనుమాన్ తండాకు చెందిన రైతు శంకర్‌నాయక్‌కు ఆవులు, మేకలను పెంచుకుంటున్నాడు. నెల రోజుల క్రితం ఓ మేక చనిపోయింది. దానికి నాలుగు పిల్లలున్నాయి. వాటికి తల్లిలేని లోటును ఆవు తీరుస్తోంది. ప్రతీ రోజు పాలిస్తోంది.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ అఫిషియల్‌గా హైదర్‌పాషా



హైదర్‌బాషా

ఇటిక్యాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి అథ్లెటిక్ అఫిషియల్‌గా జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండల కేంద్రంలోని సాయుధ చైతన్య పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు హైదర్‌బాషా ఎంపికైనట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీసన్న, కార్యదర్శి సతీశ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అతడు ఇటీవల హన్మకొండలో నిర్వహించిన సెమినార్‌లో పాల్గొని ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు హన్మకొండలో నిర్వహించనున్న 23వ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆయన రెఫరీగా వ్యవహరిస్తారని తెలిపారు. అతడిని వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, సాయుధ చైతన్య పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీల్లో స్వప్న ప్రతిభ



జాతీయ స్థాయి పతకాలు సాధించిన జిల్లా అథ్లెట్ కొడావత్ స్వప్న

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఒడిశా రాష్ట్రంలో సోమవారం ప్రారంభమైన 40వ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా క్రీడాకారిణి కొడావత్ స్వప్న ప్రతిభ కనబరిచి పతకాలు సాధించింది. ఆమె సోమవారం జరిగిన 3000 మీటర్స్ స్టీపుల్ ఛేజ్ ఈవెంట్‌లో వెండి పతకం, 1500 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించింది. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విజేందర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు, ఉపాధ్యక్షులు లావణ్యరెడ్డి, లక్ష్మి, భిక్షపతి, కోశాధికారి విజయ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు పరశురాం, అంజయ్య, కొర్ర రాములు, సభ్యులు శివకుమార్, శ్రీకాంత్, శేఖర్, హైమావతి, విష్ణు క్రీడాకారిణి స్వప్నను అభినందించారు.

వైభవంగా ఆరాధన మహోత్సవాలు



దేవేంద్రాచార్య మఠంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అమరచింత, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాగల్‌కడుమూరు గ్రామంలో విశ్వ కర్మ జగద్గురు శ్రీ దేవేంద్రచార్య మహాస్వాముల మఠంలో 73వ ఆరాధన మహోత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా మఠంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వివిధ మఠాల నుంచి వచ్చిన పీఠాధిపతులు భక్తులకు ప్రవచనాలు వినిపించారు. ఆలయావరణంలో హోమం కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం ఆశ్రమం వద్ద అన్నదాన కార్యక్రమం, సాయంత్రం గ్రామంలో స్వామి వారి పల్లకీ సేవ వేద పండితుల మధ్య బాజాభజంత్రీలతో నిర్వహించారు. దేవేంద్ర ఆచార్యుల మఠాన్ని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అమ్మాపురం దొర సోంభోపాల్, జలంధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అయుబ్ ఖాన్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాఆర్యక్రమంలో మఠం నిర్వాహకులు నరసింహాచారి, నవీన్‌చారి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'సీజేఐపై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి'

గద్వాల క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్. గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, ఎం.ఎస్.పీ, ఎం.ఎస్.ఎఫ్ అను బంధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, జోగుళాంబ గద్వాల ఇన్‌చార్జి బుర్రి సతీష్‌మాదిగ మాట్లాడుతూ 2025, అక్టోబరు 7న భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయి బెంచ్ మీద లాయర్ల వాదనలు వింటున్న సమయంలో రాకేశ్ కిషోర్ అనే వ్యక్తి షూ విసరడం తగదన్నారు. దాడికి పాల్పడిన వారిని అధికారులు వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు ఉన్నత న్యాయస్థానాల్లో పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసు కోవాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ధర్నాకు ఎమ్మార్పీఎస్ దండోరా సీనియర్ నాయకులు గంజిపేట శంక ర్, కొంకల భీమన్న మాదిగ, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో దండోరా బాస్కర్, బం డారి ఏసన్న, కోళ్ల మహేశ్ మాదిగ, సంధ్యపు ఏలియా, బి.కె. నర్సింహులు, ఎం.డి. ఆరీఫ్, సుభాన్, బాషా, బీసమ్మ, మంజుల, శ్యాంసన్, తదితరులు ఆంజనేయులు ఉన్నారు.

ఒక విజన్‌తో జడ్చర్ల అభివృద్ధి

» వరద నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం » ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



వరద నీటి కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల నియోజకవర్గంతో పాటు మునిసిపాలిటీ అభివృద్ధికి ఒక విజన్‌తో ముందుకెళ్తున్నట్లు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. మునిసిపాలిటీలో వరద నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం కోసం రూ.17 కోట్ల నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు. మునిసిపాలిటీలో రూ.17 కోట్లతో నిర్మించే డ్రైనేజీ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేసి, నిర్మాణ పనులు చేపట్టే తీరును పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో వివరించారు. మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.12.50 కోట్లు మంజూరయ్యాయని, ఈ నిధులతో పాతబజారు అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. వరద నీటి కష్టాలు తొలగేందుకు ప్రత్యేక డిజైన్‌లతో డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జడ్చర్ల మునిసిపాలిటీ అభివృద్ధి పనులకు రూ.70 కోట్ల ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించడం జరిగిందని, ప్రస్తుతం పరిశీలనలో ఉందన్నారు. మునిసిపాలిటీలో గత ప్రభుత్వ హయాంలో 16 వెంచర్‌లలో లే అవుట్‌లు చేశారని, ఆ వెంచర్‌లలో మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు కల్పించకుండానే ప్లాట్ల విక్రయాలు చేశారని ఆరోపించారు. ఆ వెంచర్‌లకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. ఇలాంటి రియల్టర్లను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. న్యూజీలాండ్‌కు చెందిన సంస్థ డైరీ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిందని, అందుకు 100 ఎకరాల స్థలం అవసరముందన్నారు. జడ్చర్ల మండలం వల్లూరు, బాలానగర్, మిడ్జిల్‌లో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. తెలంగాణ సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాదిమి శివకుమార్, మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, వైస్‌చైర్‌పర్సన్ సారిక, బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జ్యోతి, మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, డీఈ విజయభాస్కర్, ఏఈ గాయత్రి, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, చైతన్యచౌహాన్, రమేశ్, ఉమాదేవి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా వాలీబాల్ జట్ల ఎంపిక



బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్‌లో విజేతలకు బహుమతులను అందచేస్తున్న శతాబ్ది ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు బాదిమి రవిశంకర్

జడ్చర్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లా అండర్-17 బాల, బాలికల జట్లను సోమవారం ఎంపిక చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీలోని బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉమ్మడి జిల్లాల నుంచి పాల్గొన్న విద్యార్థుల్లో ప్రతిభ కనబరిచిన వారిని జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన బాలుర జట్టు సంగారెడ్డిలో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్నది.

బాలికల జట్టు రాజాపూర్ మండలంలోని తిర్మలాపూర్‌లో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నది.

కార్యక్రమంలో బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్ శతాబ్ది ఉత్సవాల అధ్యక్షుడు బాద్మి రవిశంకర్, పీఈటీ అండ్ పీడీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నిరంజన్, జగన్మోహన్‌గౌడ్, ఎస్జీఎఫ్ జిల్లా కన్వీనర్ శారదాబాయి తదితరులు పాల్గొన్నారు.



జడ్చర్ల మండలంలోని శ్రీ పరషవేదీశ్వరస్వామి దేవాలయం వద్ద నిర్వహించిన అగ్నిగుండంలో నడుస్తున్న భక్తుడు

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

- పరుషవేదీశ్వర ఆలయంలో నిర్వహణ

జడ్చర్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని కుర్వగడ్డపల్లి సమీపంలోని పరుషవేదీశ్వరాలయంలో సోమవారం తెల్లవారుజామున అగ్ని గుండం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలువురు భక్తులు సమీపంలోని దుందుభీ నదిలో పుణ్యస్నానాలు చేసి అగ్నిగుండంలోని నిప్పుల మీద నడిచారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శివ పార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

సాయంత్రం స్వామి వారి పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గోపాల్, కైలాస్‌ఝావర్, యాదయ్య, మల్లేశ్, శివ, శ్రీనివాసులు, రమాదేవి, విజయమ్మ, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

» హాస్టల్ బాత్‌రూమ్‌లో ఉరి వేసుకొని అఘాయిత్యం
» చదవలేకపోతున్నా.. మీ నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోతున్నానని నోట్
» ప్రేమ వేదింపుల కారణంగానే చనిపోయిందని తల్లి ఫిర్యాదు



ఆసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ విద్యార్థిని ఉరి వేసుకొని బలవన్మరణం చెందింది. తను చదువుకునే హాస్టల్‌లోని బాత్‌రూమ్‌లో చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని రామిరెడ్డిగూడలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో చోటుచేసుకున్నది. గద్వాల జిల్లా మల్దకల్‌కు చెందిన ప్రియాంక (18) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం 7:10 గంటల సమయంలో గురుకుల కళాశాల హాస్టల్ బాత్‌రూమ్ కిటికీకి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. గమనించిన హాస్టల్ నిర్వాహకులు విషయం పోలీసులకు తెలుపడంతో మృతదేహాన్ని జనరల్ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి గదిలో పోలీసులు సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు.

తాను చదువలేకపోతున్నానని జీవితంలో ఎంత కష్టమైనా పడతాను కానీ చదవలేకపోతున్నానని నోట్‌లో పేర్కొన్నది. " అమా... సారీ మీ నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోతున్నాను.. నా జాతకమే బాగలేదు. నేనంటే ఎవరికీ ఇష్టంలేదు. ఇక ఏ విషయంలోనూ నేను మీకు అడ్డురాను... నాకు బతకాలని లేదు." అని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నది.

విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. హాస్టల్‌కు వెళ్లి అక్కడి పరిస్థితులు, విద్యార్థులతో మాట్లాడారు. తమ కూతురిని ప్రేమించమని గ్రామానికి చెందిన ఖాదర్ వెంటపడుతు న్నాడని, ప్రేమించాలని లేఖ కూడా రాశాడని, ఈ కారణంగా ఆత్మహత్య చేసుకొని ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తూ మృతురాలి తల్లి పద్మమ్మ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

అంతకుముందు జనరల్ ఆసుపత్రికి వెళ్లిన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి విద్యార్థిని భౌతికకాయాన్ని సందర్శించారు. విద్యార్థిని తండ్రి నాగయ్యను పరామర్శించారు. జరిగిన ఘటనపై విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు.

19న స్పీడ్ సైక్లింగ్ పోటీలు

మక్తల్, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న ఉమ్మడి జిల్లా స్థాయి రోడ్ స్పీడ్ సైక్లింగ్ పోటీలను నిర్వహించనున్నట్లు సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపాలం, ప్రధాన కార్యదర్శి థాన్‌సింగ్ తెలిపారు. నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణంలోని మినీ స్టేడియంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. 14, 16 18 ఏళ్లలోపు బాల బాలికలకు 5, 10 కలోమీటర్లు, 18 ఏళ్ల పైబడిన మహిళలు, పురుషులకు 10, 20 కిలోమీటర్ల సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారిని 31 నుంచి నవంబర్ 2 వరకు రంగారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు తమను సంప్రదించాలని కోరారు. సమావేశంలో సైక్లింగ్ అసోసియేషన్ కోశాధికారి బి. రూప పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

» యువకుడిపై పోక్సో కేసు

చిన్నచింతకుంట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ పేరుతో ఓ బాలికను అపహరించి, లైంగికదాడి చేసిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు భూత్పూర్ సీఐ రామకృష్ణ తెలిపారు. సూర్యాపేట జిల్లా, మత్తంపల్లి బోజతండాకు చెందిన చందర్‌నాయక్ అనే యువకుడు మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో నమ్మించాడు. అపహరించి, లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి రిమాండ్

తెలకపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండల కేంద్రంలో జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి, సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 7న మండల కేంద్రంలోని కోహినూర్ ఫంక్షన్ హాల్‌లో 15 క్వింటాళ్ల ఇనుము చోరీకి గురయ్యింది. పోలీసులు సోమవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా నిందితుడు పట్టుబడ్డాడు. అతడు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన ఆనంద్‌గా గుర్తించారు. అతడిని అరెస్టు చేసి, రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



విద్యుత్ స్తంభానికి ఢీకొట్టి బోల్తా పడ్డ కారు

కొత్తపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని, ఆ తర్వాత విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు బోల్తాపడింది. నారాయణపేట జిల్లా, కొత్తపల్లి మండల శివారులో సోమవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. కొత్తపల్లి నుంచి గుండుమాల్ వైపు వెళ్తున్న కారు, గ్రామ శివారులో రోడ్డు పక్కన నిలిపి ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నది. అదే వేగంతో వెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్తంభం విరిగిపోవడంతో, నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ఏఈ బాల్‌రాజ్ తెలిపారు.

క్షుద్ర పూజల కలకలం

మక్తల్‌రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని మాద్వార్ గ్రామంలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. గ్రామ శివారులోని గుట్టకు వెళ్లే రోడ్డులో మూడు దారులు కలిసే చోట ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మేకను బలి ఇచ్చారు. పసుపు, కుంకుమ చల్లి క్షుద్ర పూజలు నిర్వహించారు. ఆ ప్రాంతంలో పురాతన ఆలయాలు ఉండటంతో గుప్త నిధుల కోసం క్షుద్ర పూజలు చేసి ఉంటారని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేశారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం

» నాగర్‌కర్నూల్‌లో వివాహిత, కొట్రలో వృద్ధుడు

నాగర్‌కర్నూల్ క్రైం/ వెల్దండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వేర్వేరు చోట్ల ఓ వివాహిత, ఓ వృద్ధుడు అదృశ్యమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన తుపాకుల స్వాతి (28), నరేశ్‌లకు తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నెల 7న దంపతుల మధ్య గొడవ జరిగింది.

ఆ తర్వాత స్వాతి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో నరేశ్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నామోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

● వెల్దండ మండలంలోని కొట్ర గ్రామానికి చెందిన పొనుగోటి అర్జున్‌రావు అనే వృద్ధుడు ఆదివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో అతడి సోదరుడు కృష్ణారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రైం కార్నర్

దూసుకొచ్చిన మృత్యువు

» గుర్తుతెలియని వాహనం ఢీకొని దుర్మరణం

మానవపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కారులో వెళ్తుండగా టైర్ పంక్చర్ అయ్యింది. యజమాని అర్ధరాత్రి వేళ రోడ్డు పక్కన నిలబడి సాయం కోసం ఎదురు చూస్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. మానవపాడు ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన కృష్ణయ్యగౌడ్ (50) ఆదివారం కారులో కర్నూలుకు బయలు దేరాడు. అర్ధరాత్రి దాటాక జల్లాపురం చెక్ పోస్టు వద్ద కారు టైర్ పంక్చర్ అయ్యింది. మరో వాహనం కోసం రోడ్డు పక్కన వేచి ఉండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడే ఉన్న ఆర్టీఏ సిబ్బంది గమనించి కర్నూల్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎత్తి పడేసిన ఎద్దు

» పొలంలోనే అన్నదాత కన్నుమూత



పూజారి మహదేవప్ప (ఫైల్)

కృష్ణ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రాణపదంగా పెంచి పోషిస్తున్న ఎద్దు రైతును కుమ్మి ఎత్తిపడేయడంతో పొలంలోనే కన్ను మూశాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని చేగుంట గ్రామంలో సోమవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రైతు పూజారి మహదేవప్ప తన ఎద్దులను మేతకోసం పొలానికి తీసుకెళ్లాడు. వాటిలోని ఓ ఎద్దు మహదేవప్పను కుమ్మి ఎత్తిపడేసి, కాలి గిట్టలతో వెన్నుపై తొక్కింది. అక్కడే పొలం పనులు చేస్తున్న కూలీలు గమనించి అక్కడికి చేరుకొనేలోపే అతడు మృతి చెందాడు. పూజారి మహదేవప్పకు భార్య బసమ్మ, ఆరుగురు సంతానం ఉన్నారు.

మిద్దెమీది నుంచి కింద పడి తీవ్ర గాయాలు

» చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ఇస్లావత్ ధన్‌కోటి (ఫైల్‌ఫోటో)

చారకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మిద్దె మీద నుంచి జారి కింద పడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సారబండతండాకు చెందిన ఇస్లావత్ ధన్‌కోటి (44) ఈ నెల 1వ తేదీన మిద్దె మీద నుంచి దిగుతుండగా ప్రమాదవశత్తు కాలు జారి కింద పడడంతో తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు అతడిని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అతడికి భార్య బుజ్జి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సంఘటనపై కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎదురెదురుగా వస్తూ.. రెండు బైకులు ఢీ

» ఒకరి పరిస్థితి విషమం, మరొకరికి స్వల్ప గాయాలు

గద్వాల క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయిజ మండలంలోని పులికల్ గ్రామానికి చెందిన శ్రీనివాసులు ద్విచక్ర వాహనంపై గద్వాలకు వస్తున్నాడు. అదే సమయంలో విజయుడు అనే వ్యక్తి గద్వాల నుంచి అయిజ వైపు వెళ్తున్నాడు. జిల్లాకేంద్రంలోని తెలంగాణ చౌరస్తా సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ప్రమాదంలో శ్రీనివాసులకు తీవ్రగాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన విజయుడు ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కృష్ణానది ఒడ్డున యువతి మృతదేహం

» సగం కాలిపోయిన స్థితిలో లభ్యం



మంచాలకట్ట వద్ద, కృష్ణానది ఒడ్డున యువతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రామన్‌గౌడ్

పెంట్లవెల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదీ తీరంలో ఓ యువతి మృతదేహం లభ్యమైంది. అది సగం కాలిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉండటం కలకలం సృష్టించింది. నాగర్‌కర్నూల్ జిల్లా, పెంట్లవెల్లి మండలంలోని మంచాలకట్ట వద్ద కృష్ణానది తీరంలో ఈ సంఘటన చోటు చేసుకున్నది. ఎస్‌ఐ రామన్ గౌడ్ తెలిపిన వివరాలు.. నదీ తీరంలోని చింతరాయ గుట్ట వద్ద గొర్రెల కాపరులకు ఓ గుర్తు తెలియని యువతి మృతదేహం సగం కాలిపోయి గుర్తుపట్టలేని స్థితిలో కనిపించింది. దీంతో వారు మంచాలకట్ట గ్రామస్థులకు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దాదాపు 5 రోజుల క్రితమే ఈ సంఘటన జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కంకర పరిశ్రమలో కార్మికుడికి తీవ్ర గాయాలు

» ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి

బాలానగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కంకర పరిశ్రమలో ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండల పరిధిలోని పెద్ద రేవెల్లి శివారులో గల కార్తికేయ కంకర పరిశ్రమలో ఛత్తీస్‌గడ్ రాష్ట్రానికి చెందిన రామురాన్ కశ్యప్ అనే కార్మికుడు పని చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం అతడు తీవ్రంగా గాయపడి తోటి కార్మికులకు కనిపించాడు. వారు అతడిని 108 అంబులెన్సులో జడ్చర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సంఘటనపై అతడి బంధువు దుర్గారామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లెనిన్ వెల్లడించారు.

మహిళతో మాటలు కలిపి పుస్తెల తాడు చోరీ

తిమ్మాజిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళతో ఓ వ్యక్తి మాటలు కలిపారు. ఫలానా ఊరికి దారి ఎటు అని అడుగుతూ ఆమె మెడలోనుంచి పుస్తెల తాడును లాక్కొని పరారయ్యాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజిపేట మండలంలోని మారేపల్లిలో జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం... మంగలి మనమ్మ అనే మహిళ తన మనవరాలితో కలిసి వెళ్తుండగా, ఓ వ్యక్తి ఆమెతో మాటలు కలిపాడు. ఫలానా ఊరికి ఎలా వెళ్లాలని అడుగుతూ ఆమె మెడలో నుంచి పుస్తెలతాడు తెంచుకుని పరిగెత్తి, అప్పటికే స్టార్ట్ చేసి సిద్ధంగా ఉంచుకున్న బైక్‌పై ఎక్కి పరారయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి గ్రామానికి వెళ్లి సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు.

బాధిత మహిళతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విద్యా కుసుమం జ్ఞాన పరిమళం

» అభివృద్ధి పథంలో పాలమూరు యూనివర్సిటీ
» అంచెలంచెలుగా ఎదుగుతున్న విశ్వ విద్యాలయం
» విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే లక్ష్యం
» అందుబాటులోకి కొత్త కోర్సులు, అధునాతన భవనాలు



యూనివర్సిటీ ప్రధాన భవనం



స్నాతకోత్సవానికి వేదిక కానున్న లైబ్రరీ భవనం

పాలమూరు యూనివర్సిటీ , అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో వెలసిన పాలమూరు యూనివర్సిటీ విద్యా కుసుమంగా జ్ఞాన పరిమళాలను వెదజల్లుతోంది. ఒకే ఒక్క భవనంలో, ఐదు కోర్సులతో ప్రారంభమైన వర్సిటీలో ప్రస్తుతం 21 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. 2008కి ముందు ఇక్కడ ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా పీజీ కేంద్రం కొనసాగుతుండేది. తెలంగాణ ఉద్యమం బలపడుతున్న సమయంలో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైస్ రాజశేఖర్ రెడ్డి అదే సంవత్సరం నవంబర్ 8న పాలమూరు యూనివర్సిటీకి అప్పటి ఎంపీ విఠల్‌రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. మొట్టమొదటి వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ వి.గోపాల్‌రెడ్డి నియమితులయ్యారు. అప్పుడు 151 ఎకరాల్లో పచ్చని ప్రకృతి మధ్య ప్రారంభమైన యూనివర్సిటీ అంచెలంచెలుగా ఎదుగుతూ అభివృద్ధి పథంలో నడుస్తోంది. ప్రస్తుతం 171 ఎకరాల్లో, అధునాతన భవనాలలో కొనసాగుతోంది. మూడు అనుబంధ పీజీ కేంద్రాల్లో లా, ఇంజనీరింగ్, పార్మసీ, ఎంఈబీ కళాశాలలతో పాటు, 21 కోర్సులు, 6 విభాగాలలో పీహెచ్‌డీ, 158 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలతో దినదినాభివృద్ధి చెందుతోంది.

విశ్వ విద్యాలయ విశిష్టతలు

అధ్యాపకుల కృషి, విద్యార్థుల ప్రతిభతో పాలమూరు యూనివర్సిటీ విశిష్టతను చాటుతోంది. వివిధ అంశాల్లో గిన్నిస్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు దక్కించుకున్నది. న్యాక్ బీ గ్రేడ్, యూజీసీ 12బీ గ్రేడ్‌తో పాటు, ఎన్‌సీటీఈ, పీసీఐ గుర్తింపులను పొందింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పీయూ అధ్యాపకులు ప్రొఫెసర్ పిండి పవన్ కుమార్, డాక్టర్ చంద్ర కిరణ్, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ కిశోర్, డాక్టర్ నూర్జహన్ బేగంలతో పాటు పలువురు పరిశోధనలు చేసి పేటెంట్లు పొందారు. వర్సిటీ అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఎంఓయూలను కుదుర్చుకొని విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. ఇప్పటికే మూడు స్నాతకోత్సవాలను పూర్తి చేసుకున్న యూనివర్సిటీలో ఈ విద్యాసంవత్సరం లా, ఇంజనీరింగ్ కాలేజీలు ప్రారంభమయ్యాయి. వచ్చే ఏడాది జర్నలిజం ప్రత్యేక స్కిల్స్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు యూజీసీకి ప్రతిపాదనలు పంపించారు. 3వ స్నాతకోత్సవానికి అప్పటి గవర్నర్ డాక్టర్ సౌందర రాజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ నెల 16న జరిగే స్నాతకోత్సవానికి ప్రస్తుత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రానున్నారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

పీజీ కేంద్రం కోసం రూ.1.76 కోట్ల వ్యయంతో నిర్మించిన భవనంలోనే యూనివర్సిటీ ప్రారంభమైంది. ముఖ్యమంత్రి రోషయ్య హయాంలో రూ.10కోట్లు మంజూరు చేయగా, రూ. 4 కోట్లతో సైన్స్ బిల్డింగ్, ఆర్ట్స్ కాలేజీ భవనాలను నిర్మించారు. ప్రస్తుతం బాలురకు మూడు, బాలికలకు రెండు వసతి గృహాలున్నాయి. అకాడమిక్ బ్లాక్, ఫార్మసీ కాలేజీ, పరీక్షల నిర్వహణ, పరిపాలన, గ్రంథాలయం, స్పోర్ట్స్, హెల్త్ భవనాలతో పాటు గెస్ట్ హౌస్, వీసీ రెసిడెన్సీలున్నాయి. క్రీడాకారులకు అవసరమైన సింథటిక్ ట్రాక్, ఇతర వసతులు కూడా అందుబాటులోకి వచ్చాయి. యూనివర్సిటీ అనుబంధంగా వనపర్తి, గద్వాల, కొల్లాపూర్‌లలోని పీజీ కేంద్రాల్లో తరగతి గదులు, బాలికలు, బాలురకు ప్రత్యేక భవనాలను నిర్మించారు. ప్రస్తుతం పరిశోధనా కేంద్రం, అకాడమిక్ భవనంలో అదనపు తరగతులు, సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

ప్రతీ ఏడాది 70 వేల మందికి ఉన్నత విద్య

పాలమూరు యూనివర్సిటీ ప్రతీ సంవత్సరం 70 మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తోంది. ఇందులో 18 పీజీ, 32 బీఈడీ, 90 డిగ్రీ, 3 ఎంఈడీ, 3 బీఈడీ, ఆరు ఎంబీఏ, ఒక ఎంసీఏ, 3 ఫార్మసీ, 2 లా, ఒక ఇంజనీరింగ్ కళాశాలలు న్నాయి.

అలాగే 33 ప్రభుత్వ, 102 ప్రైవేట్ 3 టీజీడబ్ల్యూఆర్‌డీసీ, మరో మూడు టీటీడబ్ల్యూఆర్ డీసీ, నాలుగు ఎంజీబీఆర్ కళాశాలలు యూనివర్సిటీకి అనుబంధంగా కొనసాగుతున్నాయి.

ముస్తాబవుతున్న యూనివర్సిటీ



పీయూలోని రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



స్నాతకోత్సవం నిర్వహించే లైబ్రరీకి భవనంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలకు సంబంధించిన చిత్రాలను వేయిస్తున్న సిబ్బంది

పాలమూరు యూనివర్సిటీ , అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో ఈ నెల 16న నిర్వహించనున్న నాల్గవ స్నాతకోత్సవానికి ముస్తాబవుతోంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో పాటు, పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా పీయూ పరిధిలోని అన్ని విభాగాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల విద్యార్థులు ప్రత్యేక క్యాంపులుగా ఏర్పడి పండుగ వాతావరణంలో పనులు చేస్తున్నారు. స్నాతకోత్సవం నిర్వహణకు 7 కమిటీలను ఏర్పాటు చేశారు. వారి ఆద్వర్యంలో పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. వేడుక నిర్వహించనున్న లైబ్రరీ ఆడిటోరియాన్ని సిద్ధం చేస్తున్నారు. అందులో 240 సీట్లు మాత్రమే ఉండటంతో, ఉత్సవాలను ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అకాడమిక్, ఫార్మసీ భవనాల్లోని సెమినార్ హాళ్లలో భారీ డిజిటల్ తెరలను సిద్ధం చేస్తున్నారు. స్నాతకోత్సవానికి మరో రెండు రోజుల సమయం మాత్రమే ఉండటంతో అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు రాత్రి, పగలు పనిలోనే నిమగ్నమై ఉన్నారు.

స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

» పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్



స్నాతకోత్సవ సమీక్ష సమవేశంలో కమిటీ సభ్యులకు సూచనలు చేస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్.

పాలమూరు యూనివర్సిటీ , అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని చేయాలని వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. యూనివర్సిటీ పరిపాలనా భవనంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో, స్నాతకోత్సవ ప్రత్యేక కమిటీ సభ్యులతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16న నిర్వహించనున్న స్నాతకోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. అందుకోసం పక్కాగా ఏర్పాట్లు చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. లోటు పాట్లు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

జిల్లాకు 10 మంది టూరిస్టు పోలీసులు

» నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



జిల్లాకు కేటాయించిన టూరిస్టు పోలీసులతో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం/ కొల్లాపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాకు 10 మంది టూరిస్టు పోలీసులను ప్రభుత్వం కేటాయించినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. జిల్లాలోని ప్రధాన పుణ్యక్షేత్రాల్లో ప్రతీ సంవత్సరం నిర్వహించే జాతరలు, ఉత్సవాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా వారు పర్యవేక్షించనున్నారు. అలాగే పర్యాటక కేంద్రాల వద్ద సందర్శకులకు అవసరమైన భద్రత కల్పించనున్నారు. జిల్లాకు కేటాయించిన టూరిస్టు పోలీసులు సోమవారం కొల్లాపూర్ పట్టణంలోని మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో, పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహకు రిపోర్టు చేశారు.

బెదిరించి భూమి రిజిస్ట్రేషన్

» పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు
» ఏడుగురిపై కేసు నమోదు

మహబూబ్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : తమను భయభ్రాంతులకు గురిచేసి భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. బాధితురాలు, హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన పొలాది కళావతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కళావతి, ఆమె కుమారులకు, రాఘవేందర్‌రాజు, అతడి అనుచరులకు మధ్య భూ వివాదం చాలా కాలంగా కొనసాగుతోంది. ఇదే అంశంపై ఉన్న కేసు విషయంలో ఆగస్టు 4న వారు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా, అప్పన్నపల్లి సమీపంలోని మయూరీ పార్కు సమీపంలో రాఘవేందర్‌రాజు, అతడి అనుచరులు వారిని కిడ్నాప్ చేసి బెదిరించారు. పాలకొండ పరిధిలోని 3 ఎకరాలకు పైగా ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. సంఘటనపై బాధితులు ఆదివారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాఘవేందర్‌రాజు, శివశంకర్‌గౌడ్, పవన్‌కుమార్ గౌడ్, విజయ్‌కుమార్, గోక నరేందర్, సురేశ్, శివలింగంలపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

పులుల సంరక్షణకు పరస్పర సహకారం

» నల్లమల అభయారణ్యంలో సంయుక్త గస్తీ
» ఏపీ, తెలంగాణ అటవీ శాఖ అధికారుల నిర్ణయం

బ్రహ్మగిరి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : అడవి అభివృద్ధి, పులులు, వన్యప్రాణుల సంరక్షణకు పరస్పర సహకారం అందించుకోవాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అటవీశాఖ అధికారులు నిర్ణయించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలంలోని బ్రహ్మగిరి వనమయూరీ అతిథి గృహంలో సోమవారం అమ్రాబాద్, నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వు ముఖ్య అధికారుల సమావేశం నిర్వహించారు. అటవీశాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి, ఏలూసింగ్ మేరు అధ్యక్షతన కొనసాగిన ఈ సమావేశంలో అటవీ సంరక్షణకు అవసరమైన అంశాలపై చర్చించుకున్నారు. రెండు రాష్ట్రాల్లో పులుల సంరక్షణ, అడవుల అభివృద్ధికి సంయుక్త గస్తీ నిర్వహించాలని, అడవుల నరికివేత నివారణకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. పులుల డేటా భాగస్వామ్యం, పర్యవేక్షణ, సంరక్షణ, ఫొటోగ్రఫీ ఆధారంగా పులుల కదలికలను గుర్తించే యంత్రాల ఏర్పాటు తదితర నిర్ణయాలు తీసుకున్నారు. వణ్యప్రాణుల కారిడార్ నిర్వహణ, మనుషులు, జంతువుల మధ్య సంఘర్షణలు తగ్గించడంపై చర్చించారు. ఈ అంశాలపై రెండు రాష్ట్రాల అధికారులు అంగీకారం తెలిపారు. కార్యక్రమంలో డీఎఫ్‌వోలు, ఎఫ్‌డీవోలు, ఎఫ్ఆర్‌వోలు పాల్గొన్నారు.

నేడు వనపర్తికి రానున్న మాజీ ముఖ్యమంత్రి

వనపర్తి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నేడు (మంగళవారం) జిల్లా కేంద్రానికి పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతం మాజీ ముఖ్యంత్రి నారాయణస్వామి రానున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక కోసం నేడు జిల్లా కేంద్రానికి మాజీ ముఖ్యమంత్రి వస్తున్నారని, ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఉంటుందని, మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి మాజీ సీఎం నారాయణస్వామితో పాటు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, స్పోర్ట్స్ కార్పొరేషన్ చైర్మన్ శివసేనరెడ్డి, నేషనల్ ఏఐసీసీ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యరెడ్డి హాజరుకానున్నారని తెలిపారు.

యశోదమ్మ కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

» నాయనమ్మకు నివాళి అర్పించిన సినీ దర్శకుడు నాగ్ అశ్విన్



ఐతోల్‌లో ఇటీవల మృతి చెందిన యశోదమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

తాడూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలంలోని ఐతోలు గ్రామంలో ప్రముఖ దర్శకుడు నాగ్ అశ్విన్ నాయనమ్మ యశోదమ్మ మృతి చెందిన విషయం విదితమే. కుటుంబ సభ్యులు సోమవారం సాయంత్రం నిర్వహించిన దశదినకర్మకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. యశోదమ్మ చిత్ర పటం వద్ద నివాళి అర్పించారు.

కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే నాయనమ్మ చిత్ర పటానికి మనుమడు నాగ్ అశ్విన్ పూలు వేసి నివాళి అర్పించారు. అలాగే నాగం శశిధర్‌రెడ్డి, ఎస్‌వీఎస్ హాస్పిటల్స్ అధినేత రాంరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు మణెమ్మ, మాజీ ఎంపీపీ గుర్రాల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఎన్ఆర్ఐ నిధులతో పాఠశాల అభివృద్ధి

పెబ్బేరు రూరల్ అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గుమ్మడం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని వివిధ అభివృద్ధి పనుల మరమ్మతులకు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ భూజల భువనేశ్వర్‌రెడ్డి విరాళంతో డయాస్ నిర్మాణం, ప్రహరీ మరమ్మతులు విద్యార్థులకు ఆర్వో ప్లాంట్, వైఫై, ప్రింటర్ విరాళంగా సోమవారం అందజేశారు. అదే విధంగా కాంపౌండ్ వాల్ మరమ్మతులకు భువనేశ్వర్‌రెడ్డి సోదరుడు ఖగేందర్‌రెడ్డి ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు, ఉపాధ్యాయులు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, రవికుమార్‌రెడ్డి, సుధాకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు చెస్ బోర్డుల వితరణ



చెస్ బోర్డులను పంపిణీ చేస్తున్న మహిపాల్

వీపనగండ్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ఎన్ఆర్ఐ ఫోరం దాతల సహకారంతో స్టేట్ కోఆర్డినేటర్ మహిపాల్‌రెడ్డి చెస్ బోర్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఐ మేడిపల్లి యుగంధర్, దొడ్ల శివకుమారులు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. చెస్ అనేది మేధస్సును విభిన్న ఆలోచనలను పెంచుతుందని తెలిపారు. ఎంఈవో నరసింహ, ప్రధానోపాధ్యాయులు షబ్బీర్ అహ్మద్, శంకర్, శ్రీనివాసులు, నిరంజన్, శ్రీకాంత్, శ్రీనివాసులు, సీఆర్పీ వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

శ్రీరంగాపురం అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్త సూగూరులో రాత్రి బత్తిని బాలమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సహకార సంఘం సభ్యులు మృతురాలి కుటుంబానికి రూ. 5వేల ఆర్థిక సాయం అందించారు. కొత్త సూగూరులో 9 మంది మిత్రులు 18 సంవత్సరాల క్రితం ప్రతీ నెల కొన్ని డబ్బులు పొదుపు చేసి సహకార సంఘం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి గ్రామంలో అన్నదాన కార్యక్రమాలు, గ్రామంలో ఏదైనా ప్రమాదం సంభవించిన, నిరుపేద కుటుంబాల్లో మృత్యువాత పడిన వారికి కులమతాలకు, పార్టీలకు అతీతంగా సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుతుబ్

అమరచింత, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ అభివృద్ధి కోసం రూ.15 కోట్లు మంజూరైనా.. నేటికి పనులు కాకపోవడం విచారకరమని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ విమర్శించారు. సోమవారం చింతల ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మంత్రి వాకిటి శ్రీహరి ఇటీవల నిధులు కేటాయించిన ఇప్పటికీ ఏ ఒక్క పని ప్రారంభానికి నోచుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల పూర్తయిన నేటికీ అమత్యం మండలానికి జూనియర్ కాలేజీ, నూతన ప్రభుత్వ భవనాలు నీ స్టేడియం తదితర పనులు ప్రారంభం కాలేదని అని విమర్శించారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు శ్రీకాంత్, రవి అంజి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో ఆనంద్

పాన్‌గల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని ఎంఈవో ఆనంద్ అన్నారు. సోమవారం మండలంలోని యూపీఎస్ గోప్లాపూర్ కేజీబీవీ మండల కేంద్రంలోని హరిజనవాడ పాన్‌గల్, కేతేపల్లి ప్రాథమిక యూపీఎస్, జమ్మాపూర్ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు శాతం మరియు విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కేజీబీవీ పాఠశాలలో 10 తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికతో చదువుతూ 10వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీ గోవింద్ నాయక్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ పింఛన్ మంజూరు చేయాలి

ఆత్మకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ మంజూరు చేయాలని సీపీఐ జిల్లా నాయకులు శ్రీహరి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నేటికి నెరవర్చడం లేదన్నారు.

కనీస వసతులు ఏవీ?

- పెట్రోల్ బంకుల్లో కానరాని సౌకర్యాలు
- డెన్సిటీ నాణ్యతపై అనుమానాలు



నీడ లేని పెట్రోల్ బంక్

రేవల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పెట్రోల్‌బంకు, శానాయిపల్లి గ్రామ శివారులో ఓ పెట్రోల్‌బంకు, అదే విధంగా మండలంలోని చెన్నారం గ్రామ శివారులో హెచ్‌పీ పెట్రోల్ బంకులు ఉన్నాయి. కానీ ఏ ఒక్క పెట్రోల్ బంకులో కూడా పూర్తి స్థాయిలో వసతులు లేవు. అదే విధంగా పైన కప్పు కూడా లేదు. పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు ఉచితంగా తాగునీరు, మరుగుదొడ్లు, వాహనాలకు గాలి పట్టేందుకు గాలి యంత్రాలు ఇలాంటి వసతులు ఉచితంగా కల్పించాలి.

- గ్రామాల్లోని ప్రజలకు పెట్రోల్ మరియు డీజిల్ వాడటమే తెలుసు కానీ ఏ డెన్సిటీలో వాడాలి అనే విషయంపై సరైన అవగాహన లేదు. వీటిపై అవగాహన ఉన్న వారు డెన్సిటి పరిశీలించడానికి ప్రయత్నించిన కొన్ని బంకుల్లో సరిగ్గా కనిపించడం లేదు.

ఎక్కడ ఎలా ఫిర్యాదు చేయాలి

పెట్రోల్ బంకుల్లో వసతులు లేవని ఎక్కడ ఎవరికి ఎలా ఫిర్యాదు చేయాలో కూడా మాకు తెలియడం లేదని స్థానికంగా తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో వీటి గురించి అడిగినా.. సరైన సమాచారం మాకు అంద లేదని ఎక్కడ ఎలా ఫిర్యాదు చేయాలో తెలియక అలాగే పెట్రోల్, డీజిల్ వాడుతున్నామని వాపోతున్నారు.

సరైన వసతులు లేవు...

పెట్రోల్ బంకులలో వినియోగదారులకు, ప్రజలకు సరైన వసతులు లేవు. గాలి యంత్రాలు, వాహనదారులకు ముఖ్యం. కానీ వారు కరెంటు లేదని, యంత్రం పని చేయడం లేదని, గాలి లేదని సాకులు చెబుతున్నారు.

కనీస సదుపాయాలు లేవు..

పెట్రోల్ బంకుల్లో కనీస సదుపాయాలు ఉండటం లేదు. గ్రామాల్లో మురుగుదొడ్ల వాడకం చాలా తక్కువ. వీటి అవసరం లేనప్పటికీ మిగితా సదుపాయాలు కల్పించాలి. ముఖ్యంగా గాలి యంత్రాలు ఏర్పాటు చేసి వాహనాలకు గాలి తనిఖీ చేయాలి. పెట్రోల్ బంకుల పై పైకప్పులు ఏర్పాటు చేయాలి, ప్రజలకు తాగునీరు ఎల్లప్పుడు అందుబాటులో ఉంచాలి. ఇలా వసతులు లేని బంకులపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలి.

- మహేష్ చీర్కపల్లి

ఫిర్యాదు చేస్తే నోటీసులు జారీ చేస్తాం..

పెట్రోల్ బంకులో కనీస వసతులు వినియోగదారులకు కల్పించాలి. ఎవరైనా ఇబ్బందులతో వచ్చి ఫిర్యాదు చేస్తే.. చర్యలు చేపట్టి వారికి నోటీసులు జారీ చేస్తాం. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే.. ఆయిల్ కంపెనీ వారికి ఫిర్యాదు చేయవచ్చు. విచారణ చేసి మేము ఆయిల్ కంపెనీ వారికి వినియోగ వినియోగదారుడి ఫిర్యాదుల గురించి తెలియజేస్తాం.

- విశ్వనాథ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

అన్ని గ్రామాల రోడ్లను బీటీతో నిర్మిస్తాం..



బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర నియోజకవర్గంలోని అన్ని గ్రామాల రోడ్లను విడతల వారీగా బీటీతో నిర్మాణం చేస్తామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం కొత్తకోట మండలంలోని ముమ్మళపల్లి గ్రామ జాతీయ రహదారి నుంచి పుల్లారెడ్డికుంట తండా వరకు రూ.97 లక్షలతో చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామాలు అభివృద్ధి సాధించాలంటే మెరుగైన రవాణా సౌకర్యం ఉండాలన్నారు. మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, చంద్రశేఖర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, బీచుపల్లి యాదవ్, శివరాజ్, సాయిరెడ్డి, శివరాములు, మాసన్న, సురేందర్‌రెడ్డి, వెంకట్రామారెడ్డి, కురుమూర్తి, అంజనేయులు, చంద్రశేఖర్, నాగేంద్రం, శేషన్న, ముస్తఫా తదితరులు ఉన్నారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకుల సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

కొత్తకోట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఓటు చోరీకి వ్యతిరేకంగా సోమవారం సంతకాల సేకరణ నిర్వహించారు. ఏఐసీసీ అగ్ర నాయకులు రాహుల్‌గాంధీ దేశ బాగు కోసం సాక్ష్యాధారాలతో బయట పెట్టిన ఓటు చోరీకి మద్దతు తెలపడానికి స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు రావాలని కోరారు. కృష్ణారెడ్డి, బోయోజ్, శ్రీనివాసులు, జేసీబీరాము, సాయులు యాదవ్, సుభాష్, సాయిరాం, శ్రీకాంత్ ఏజాజ్, వెంకటేష్, భవాని బాలరాజు, ఫెరోజ్, నజీర్, శ్యాంకుమార్, దిలీప్‌రెడ్డి, నవీన్ కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అత్యవసర సేవల్లో నిర్లక్ష్యం చేయొద్దు



సిబ్బందికి సూచనలు చేస్తున్న మహబూబ్

పెబ్బేరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాల సమయంలో అత్యవసర సేవల్లో నిర్లక్ష్యం చేయరాదని 108అంబులెన్స్ జిల్లా అధికారి మహబూబ్ అన్నారు. మునిసిపాలిటీలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అంబులెన్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రమాదాల సమయాల్లో సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రమాద సమయంలో ఫోన్‌కాల్స్ వచ్చిన 15 నిమిషాల్లో సంఘటన స్థలానికి చేరుకుని ప్రజల విశ్వాసాన్ని నలబెట్టేలా సేవల ప్రమాణాలను పెంచేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఎండి. ఖాజా ఫారుక్, ఈఎంటీఎస్ మహమ్మద్, మాసుం బాబ ఉన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి



ప్రజలతో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్ చౌరస్తా, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఖీమ్యానాయక్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డిప్యూటీ కలెక్టర్ రంజిత్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా ప్రజావాణితో సహా సీఎం ప్రజావాణి నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణికి మొత్తం 34 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ జేఏసీ బంద్‌కు అన్ని పార్టీలు కలిసిరావాలి

- అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్



మాట్లాడుతున్న సతీష్ యాదవ్

వనపర్తి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీసీ జేఏసీ పిలుపులో భాగంగా ఈ నెల 18న జరిగే రాష్ట్ర బంద్‌కు అన్ని పార్టీలు కలిసిరావాలని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీల 42 శాతం రిజర్వేషన్ల సాధనకు ఈ నెల 14న చేపట్టనున్న రాష్ట్ర బంద్‌ను మార్పు చేస్తూ.. పలు బీసీ సంఘాలు ఏకమై 18వ తేదీకి మార్చడం జరిగిందన్నారు. బీసీ సంఘాలన్నీ ఒక్కటై జేఏసీగా ఏర్పడటం జరిగిందని, అందులో భాగంగానే జిల్లా బంద్‌కు అఖిలపక్ష ఐక్యవేదిక సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. అంతేకాకుండా 19వ తేదీన జరిగే మోటర్ సైకిల్ ర్యాలీని కూడా పార్టీలకతీతంగా బీసీ సంఘాలు, బీసీ సోదరులు, కుల సంఘాలు, రాజకీయ పార్టీలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. వెంకటేశ్వర్లు, శంకర్, యాదయ్య. శ్యాం, రామస్వామి, భరత్, నాగరాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కళాశాల భవనానికి పునరుద్ధరణ పనులు చేపట్టాలి



వినతిపత్రం ఇస్తున్న సంఘం సభ్యులు

వనపర్తి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : శిథిలావస్థకు చేరిన బాలికల కళాశాల భవనానికి పునరుద్ధరణ పనులు చేపట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి లక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఐద్వా సంఘం సభ్యులు కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని బాలికల కళాశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, గత 25 సంవత్సరాల క్రితం అప్పటి గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న చిన్నారెడ్డి పార్కుగా ఉన్న స్థలాన్ని విద్యార్థుల భవిష్యత్తు కోసం కళాశాలగా ఏర్పాటు చేయించడం జరిగిందన్నారు. నేడు భవనం పూర్తిగా ధ్వంసమై కిటికీలు, తలుపులు ఊడిపోతున్నాయన్నారు. భవనం శిథిలావస్థలో ఉండటంతో విద్యార్థులకు ప్రమాదకరంగా మారిందన్నారు. కళాశాలలో టాయిలెట్లు, మూత్రశాలలు కూడా లేకపోవడంతో దాదాపు 700 నుంచి 750 మంది విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయన్నారు. వారం రోజుల్లో కళాశాల భవనానికి మరమ్మతులు చేసి పునరుద్ధరణ పనులు ప్రారంభించకుంటే ఐద్వా సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా సంఘం జిల్లా అధ్యక్షురాలు గద్వాల సాయిలీల, ఉమా, రాణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బతికించిన వారికే అధ్యక్ష పదవి ఇవ్వాలి

వనపర్తి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీనే నమ్ముకుని కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన సీనియర్ నాయకులకే జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వాకిటి బాలరాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్, రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా అధ్యక్ష పదవులను నియయించేందుకు అబ్జర్వర్లను నియమించడం జరిగిందని, అభిప్రాయ సేకరణ కోసమే నేడు వారు జిల్లా కేంద్రానికి వస్తున్న తరుణంలో సీనియర్ నాయకులను పరిగణంలోకి తీసుకోవాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పదేళ్ల పాటు అనేక అవమానాలు, పోలీసు కేసులు, అనేక ఇబ్బందులు ఎదుర్కొని పార్టీని అంటిపెట్టుకుని ఉన్న వారిని కాదని, కాంగ్రెస్ పార్టీ పేరుచెప్పుకుని కాలం గడుపుకునేందుకు వచ్చిన వారిని గుర్తించాలన్నారు. పార్టీని బతికించిన వారికే పగ్గాలు అప్పగించాలని కోరారు.

శివాలయాల్లో ఆరుద్రోత్సవ పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తకోట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శివాలయాల్లో ఆరుద్రోత్సవ పూజలు భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. శివుడి జన్మ నక్షత్రమైన ఆరుద్రను పురస్కరించుకొని పట్టణంలోని భవాని శంకర, పాత శివాలయం, భక్త మార్కండేయస్వామి, కానాయపల్లి, పామాపురం గ్రామాల్లోని కోటిలింగేశ్వరస్వామి, రామేశ్వరస్వామి దేవాలయాలోని శివలింగాలకు ఏకాదశ రుద్రాభిషేకం పూజలు నిర్వహించారు. కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ ధర్మకర్త మహేశ్వర్, ప్రధాన కార్యదర్శి శేఖరయ్య, విశ్వనాథం అన్నదానం చేశారు.

బాణసంచా విక్రయదారులు అనుమతి తీసుకోవాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బాణసంచా విక్రయదారులు తప్పకుండా పోలిసు అధికారి అనుమతి తీసుకోవాలనీ ఎస్పీ రావుల గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి సందర్భంగా బాణాసంచా విక్రయాల కోసం డివిజనల్ స్థాయి పోలీసు అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా నిల్వ చేసినా.. తయారు చేసినా.. దుకాణాలను నెలకొల్పిన, సరైన భద్రతా ప్రమాణాలు లేకుండా విక్రయాలు జరిపినా, పేలుడు పదార్థాల చట్టం - 1884, రూల్స్ - 1933 సవరణ 2008 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రద్దీ ప్రదేశాలు, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, పెట్రోల్ బంకులు, ప్రజలు నివసించే ప్రాంతాల్లో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయకుండా సంబంధిత అధికారులు తహసీల్దార్, ఫైర్ విభాగం, పోలీసుశాఖ సూచించిన ప్రదేశాల్లో మాత్రమే లైసెన్స్ ఉన్న వ్యాపారులు మాత్రమే విక్రయించాలన్నారు.

ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు

పోలీస్ ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహి స్తే చర్యలు తప్పవని ఎస్పీ రావుల గిరిధర్ హెచ్చరించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం ప్రజావాణికి 10 ఫిర్యాదులు రాగా.. 5 భూ తగాదాలు, 4 పరస్పర గొడవలకు సంబంధించి, ఇంకోటి భార్యాభర్తల ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు.

ప్రతీ ఒక్కరు సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లే శ్రీనివాసులు



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అల్లే శ్రీనివాసులు

వనపర్తి వైద్యవిభాగం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీపీఆర్ నేర్చుకోవడంతో ప్రతీ ఒక్కరూ ఒక ప్రాణాన్ని రక్షించే సామర్థ్యం పొందుతారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లే శ్రీనివాసులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఏడాది అక్టోబరు 13 నుంచి 17 వరకు సీపీఆర్ అవగాహన వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సారి జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, ప్రజా స్థాయిలో సీపీ ఆర్‌పై వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సీపీఆర్ అనేది అత్యవసర సమయంలో గుండె, శ్వాస ఆగిపోయిన వ్యక్తి ప్రాణాలను రక్షించేందుకు అత్యంత కీలకమైన పద్ధతి అని, దీనిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది సీపీఆర్ శిక్షణలో పాల్గొని వారోత్సవాలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ మంజుల, శ్రీనివాస్ కొండ, నర్సింగరావు విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

వనపర్తి రాజీవ్ చౌరస్తా, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఖరీఫ్ 2025-26 సీజన్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లతో వీసీ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. వనపర్తి జిల్లా కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యానాయక్, పౌర సరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, డీఎం జగన్, డీఆర్‌డీవో పీడీ ఉమాదేవితో కలిసి వీసీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జిల్లాలో ఖరీఫ్ 2025-26 సీజన్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రాణి, మానస, ఆంజనేయులు గౌడ్, స్వరణ్‌సింగ్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాకీ కార్డులతో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



బస్టాండులో బాకీ కార్డులను ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖిల్లాఘణపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ప్రజలకు బాకీ కార్డులను అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీల మేరకే బాకీ కార్డులు అందిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు 6 గ్యారెంటీల పేరుతో 420 హామీలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, గోపాల్, వెంకటేష్, రవీందర్‌రెడ్డి, ఆంజనేయులు గౌడ్, సత్యం, బుచ్చిబాబు గౌడ్, మల్లేష్, చెన్నయ్య, సింగోటం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్లు, టై, బెల్టుల వితరణ

- తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు జోషి గోపాల శర్మ



షూస్, టై, బెల్టులు పంపిణీ చేస్తున్న జోషి గోపాల్ శర్మ

ఖిల్లాఘణపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోలిపూర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు జోషి గోపాల్ శర్మ తన సొంత ఖర్చులతో బూట్లు, టై, బెల్టులు, ఐడెంటి కార్డులు వితరణ చేశారు. ఈ సందర్భంగా జోషి గోపాల్ శర్మ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సైతం ప్రైవేట్ పాఠశాల విద్యార్థుల మాదిరిగా వస్త్రధారణ ఉండాలని రూ.30,000లతో 255 మంది విద్యార్థులకు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో ప్రతిభ చాటాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి జయశంకర్ సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, తిరుమల్, అజీమ్ భాష, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు అండంగా ఉంటాం



బాలీశ్వరమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న స్వప్న భాస్కర్

గోపాల్‌పేట, అక్టోంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మానసిన వ్యాధితో ఇబ్బందులు పడుతున్న ఈ నిరుపేద కుటుంబానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని కర్రోళ్ల స్వప్న భాస్కర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని చెంద్రాయుని గడ్డ కాలనీలో కుటుంబ పోషనకు ఇబ్బందులు పడుతున్న బాలీశ్వరమ్మ, మశన్న కుటుంబాలను పరామర్శించారు. చెంద్రాయుని గడ్డ కాలనీకి చెందిన బాలీశ్వరమ్మ కుమారుడు, కుమార్తె కొన్ని రోజులుగా మానసిక పరిస్థితి బాగోలేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న భాస్కర్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారి ఆర్థిక పరిస్థితులపై అరాతీశారు. సాయం చేస్తానని హామీ ఇచ్చారు. రాములు, బాలీశ్వరమ్మ, చెన్నమ్మ, సువర్ణ, గణేష్, మహేందర్, శివ, గోపాల్ పాల్గొన్నారు.